

.. మనమే ప్రథమం

నూతన విద్యా విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు.

10లో



పాపం పసివాళ్లు...

అభం శుభం తెలియని ఆ చిన్నారులు ఆడుకుంటూ తమ నివాసం సమీపంలోని ఉమ్మెత్త చెట్టు కాయలు తిని అస్వస్థతకు గురయ్యారు.

10,950 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 10,950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.55 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఇళ్ల రిజిస్ట్రేషన్లపై శిక్షణ



కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్

కాకినాడ లీగల్: గ్రామ సచివాలయాల్లోనే పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు కాకినాడ జిల్లావ్యాప్తంగా 9 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోగల గ్రామ సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలకు బుధవారం శిక్షణ ఇచ్చామని కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్లకు గురువారం శిక్షణ ఇస్తామని తెలిపారు.

నేడు సత్యదేవుని నిజరూప దర్శనం

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మి సత్యవతీదేవి, లింగాకారంలోని శంకరుడు గురువారం ఏ విధమైన ఆభరణాలు లేకుండా భక్తులకు (నిజరూప) దర్శనమివ్వనున్నారు. గత కార్తిక మాసం నుంచి ప్రతీ సోమవారం మంచిముత్యాల కవచాలు ధరించి (ముత్తంగి సేవ), ప్రతీ గురువారం నిజరూపు దర్శన సేవను భక్తులకు కల్పిస్తున్న విషయం తెలిసిందే.

నేడు శ్రీరామునికి పట్టాభిషేకం

రత్నగిరి క్షేత్రపాలకుడు శ్రీరాముని జన్మనక్షత్రం 'పునర్వసు ' సందర్భంగా గురువారం రత్నగిరి రామాలయంలో కొలువైన సీతారాములకు తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం ఏడు గంటలకు సీతారాములకు పట్టభిషేకం కూడా నిర్వహిస్తారని పండితులు తెలిపారు.

నేడు వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

పుష్య పౌర్ణిమ సందర్భంగా గురువారం రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నారు. రూ.750 టిక్కెట్‌తో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చునని అధికారులు తెలిపారు.

నేడు ఓటర్ల దినోత్సవం

కాకినాడ సిటీ: జిల్లా స్థాయి జాతీయ ఓటరు దినోత్సవం-2024 వేడుకలు గురువారం ఉదయం 11 గంటలకు విక్టోరియా వాటర్ వర్క్స్ ప్రాంగణంలోని కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయ సమావేశ హాలులో జరుగుతాయి. ఈ మేరకు కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం తెలిపారు.

వాయుసేనలో ప్రవేశానికి 6 వరకూ దరఖాస్తులు

అమలాపురం రూరల్: కేంద్రం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకంలో భాగంగా వాయుసేనలో ప్రవేశానికి ఫిబ్రవరి 6వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో యువత దరఖాస్తు చేసుకోవచ్చని సికింద్రాబాద్ వాయుసేన చెందిన సార్జెంట్లు జీవన్ సింగ్, అనిల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అమలాపురంలో పలు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ డాక్టర్ వీవీ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనిల్ మాట్లాడుతూ ఇంటర్ నుంచే భారత వాయుసేనలో మంచి ఉద్యోగాన్ని పొందవచ్చన్నారు.

నేతన్నకు సర్కార్ చేయూత



- 90 శాతం సబ్సిడీతో అధునాతన యంత్ర పరికరాలు
- 50 ఏళ్ల నిండిన చేనేత కార్మికులకు పింఛన్
- విజయవంతంగా నేతన్న నేస్తం అమలు
- ఏటా రూ. 24 వేల చొప్పున నేరుగా ఖాతాల్లో జమ
- ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న కుటుంబాలు

కాకినాడ సిటీ: జనరంజక పాలనతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత రంగానికి ఊపిరి పోశారు. వివిధ పథకాలతో నేతన్నలకు అండగా నిలిచారు. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం కింద ఏటా రూ. 24 వేలు అందించడంతో పాటు ముద్ర రుణాలు, జాతీయ చేనేత అభివృద్ధి పథకం ద్వారా 90 శాతం సబ్సిడీతో పనిముట్లు, జాతీయ చేనేత బ్రాండ్ పథకం ద్వారా నేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో చేనేత రంగం గాడిన పడుతోంది. వృత్తి వదిలేసిన నేతన్నలు కూడా తిరిగి రావడంతో మగ్గాలకు మళ్లీ మంచిరోజులు వచ్చాయి.

నాడు నిర్వీర్యం..

జిల్లాలో 3,300 మగ్గాలుండగా 4,500 మంది కార్మికులు పని చేస్తున్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు నేతన్నలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. వారి సంక్షేమానికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వర్షాకాలంలో పరిశ్రమకు అంతరాయం కలిగినప్పుడు నెలకు రూ.4 వేలు, వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా, చేనేత కార్మికులకు ఇళ్లు, షెడ్లు, భవనాలు అంటూ హామీలిచ్చినా ఒక్కటంటే ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ఆదరణ పథకం కింద డబ్బులు కట్టించుకుని అరకొర సామగ్రి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో నేతన్నలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారు.

నేడు పూర్వ వైభవం

నాడు ప్రతిపక్షనేతగా చేనేతల దుర్భర జీవితాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నేతన్నల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారు. 2019 డిసెంబర్ 21న వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా రూ.24 వేలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకూ ఐదు విడతల్లోనూ జిల్లాలోని నేతన్నలకు రూ.6.66 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. 50 ఏళ్లు దాటిన 3,750 మందికి పింఛన్లు అందిస్తున్నారు. చేనేత ముద్ర పథకం ద్వారా చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న 480 మందికి రూ.50 వేలు నుంచి రూ.2 లక్షల వరకూ రుణాలు మంజూరు చేశారు. జిల్లాలో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేసి రుణాలు అందిస్తున్నారు. వర్క్ షెడ్లు, పర్మినెంట్ షెడ్లు, మంజూరు చేస్తూ నేతన్నలకు అండగా నిలిచారు. ఫలితంగా నేతలన్నలంతా ఉత్సాహంగా పని చేసుకుంటుండగా చేనేత రంగానికి పూర్వ వైభవం వచ్చింది. దీంతో కాకినాడ జిల్లాలో రెండు చేనేత క్లస్టర్లు అయిన ప్రత్తిపాడు, గొల్లప్రోలుకు సంబంధించి రూ.2 కోట్ల విలువైన చేనేత పరికరాలు అందజేశారు. అదే విధంగా 2023 సంవత్సరానికి ఉప్పాడ చేనేత సహకార సంఘానికి వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ద్వారా రూ.10 లక్షలు నగదు పురస్కారం అందింది. 2023లో కేంద్ర ప్రభుత్వం ఉప్పాడ జాంధానీ చీరలకు ఒన్ డిస్ట్రిక్ట్ ఒన్ ప్రోడక్ట్ కింద బంగారు పతకం కాకినాడ జిల్లాకు అందజేసింది.

ఎంతో మేలు జరిగింది



ఈమె పేరు ఇనుమర్తి వీరలక్ష్మి. మగ్గం పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక నేతన్న నేస్తం పథకం కింద ఏటా రూ.24 వేలు అందుతోంది. దీంతో పాటు ముద్ర పథకం కింద రుణం మంజూరైంది. జాతీయ అభివృద్ధి చేనేత మండలి ద్వారా 90 శాతం సబ్సిడీపై మగ్గం పనిముట్లు అందడంతో వీరలక్ష్మి కుటుంబం ఆర్థికంగా నిలబడింది. గతంలో చాలీచాలని ఆదాయం, పెట్టుబడి కోసం చేసిన అప్పులు, పిల్లల ఫీజులు ఇలా ఆర్థికంగా ఇబ్బంది పడేవారమని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక తమకు ఎంతో మేలు జరిగిందని వీరలక్ష్మి చెబుతోంది.

జిల్లాలో ఐదేళ్లలో నేతన్న నేస్తం పథకం ద్వారా అందిన సొమ్ము

సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
2019-20	2,509	6.02
2020-21	2,736	6.57
2021-22	2,461	5.91
2022-23	2,676	6.42
2023-24	2,778	6.67

అర్హత ఆధారంగా పథకాలు



అర్హత ఆధారంగా చేనేతలకు పథకాలన్నీ అందజేస్తున్నాం. చేనేత క్లస్టర్ల పరిధిలో కార్మికులకు పనిముట్లు అందజేశాం. రకరకాల డిజైన్ల తయారీకి కూడా చర్యలు తీసుకున్నాం. నేతన్నలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాం. అలాగే 50 ఏళ్లు నిండిన నేతన్నలకు పింఛన్లు అందజేస్తున్నాం. దీంతోపాటు ముద్ర రుణాలు కూడా మంజూరు చేయించాం.

-కె.పెద్దిరాజు, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి, కాకినాడ

ఆరోగ్య పథకాలు అభినందనీయం

కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్



జగనన్న కంటి వెలుగు పథకంలో కంటి అద్దాలను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

రాజానగరం: ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు అభినందనీయమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయవలసిన అవసరం ఉందని చెప్పారు. ఇవి మంచి ఫలితాలను ఇస్తాయంటూ సీఎం ఆలోచన స్ఫూర్తినిస్తుందంటూ కితాబిచ్చారు. లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి బుధవారం సందర్శించారు. ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈ సందర్భంగా జగనన్న కంటి వెలుగు పథకంలో లబ్ధిదారులకు కంటి అద్దాలను కేంద్ర మంత్రి అందజేశారు. తొలుత కలెక్టర్ కె.మాధవీలత జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ల గురించి మంత్రికి వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం ప్రస్తుతం జిల్లాలో జరుగుతోందన్నారు. తొలి విడతలో 468 వైద్య శిబిరాలు నిర్వహించి, 231224 మందికి సేవలు అందించారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా లక్షా 82 వేల గృహాలను సందర్శించి, 108, 104 అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.సనత్‌కుమారి పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్నకు రూ.కోటి ఆదాయం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.రూ 1,02,78,663 వచ్చినట్లు ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ప్రధాన హుండీల నుంచి రూ 74,29,750, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ 28,48,913 సమకూరిందన్నారు. అలాగే విదేశీ కరెన్సీ, బంగారం 11 గ్రాములు, వెండి 739 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. హుండీల్లో పువ్వులు, కరెన్సీలు పాడయ్యే వస్తువులు వేయరాదన్నారు. అలాగే ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,54,454 లభించిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో మందపల్లి మందేశ్వర స్వామి ఆలయ దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి, పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి ఈవో ఎస్‌వీఎస్ఎన్ ఎస్‌పీ ప్రసాదరాజు, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం ఈవో ఎం.రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు.

లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి

కలెక్టర్ కృతికా శుక్లా



బాలికకు నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: ఆడ శిశువు పట్ల వివక్షతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు జిల్లాలో గిరిజన గ్రామాలు, లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ, స్త్రీ, శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి జాతీయ బాలికా దినోత్సవం, మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించి లింగనిర్ధారణ పరీక్షలు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టామన్నారు. చట్టవిరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు అందరూ చదువుకున్న నాడే సమానత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం వస్తాయని కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. చదువుకొని ఉద్యోగం సంపాదించి ఆర్థికంగా స్థిరపడిన నాడే వివాహం గురించి ఆలోచించాలన్నారు. కొన్ని వెనుకబడిన ప్రాంతాలలో 14 సంవత్సరాలకే వివాహం చేసుకొని చదువు మానేసి మానసిక, శారీరక ఇబ్బందులకు మహిళలు గురవుతున్నారని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. అటువంటి పరిస్థితులు లేకుండా ప్రతి బాలిక చదువుకోవాలని, చదువు ద్వారానే మహిళల సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ అన్నారు. జిల్లా ఫోర్త్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి హరినారాయణ మాట్లాడుతూ జిల్లాలో పీసీ అండ్ పీ అండ్ డీటీ యాక్ట్ ద్వారా 163 స్కానింగ్ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించామని, ఒక కేసు కూడా నమోదు కాలేదని అన్నారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌ను సక్రమంగా అమలు చేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లాను ఆయన అభినందించారు. బాలికలపై వివక్ష లేకుండా మగ పిల్లల మైండ్‌సెట్ మారాలని అప్పుడే బాలికలు, మహిళలు సురక్షితంగా ఉంటారని జడ్జి హరినారాయణ అన్నారు. ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం, విద్యాహక్కు చట్టం బాలికలకు, మహిళలకు రక్షణగా ఉన్నాయన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ చట్టంపై గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుంటూ అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సేవ్ గర్ల్ చైల్డ్ నినాదంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, పెయింటింగ్, పోస్టర్ ప్రదర్శన వంటి అంశాలపై పోటీలు నిర్వహించి నగదు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. కలెక్టర్, ఎస్పీ భేటీ బచావో బేటీ పడావో పోస్టర్స్, స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఎస్సీపీసీఆర్ మెంబర్ ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, డీఐవో డాక్టర్ రత్నకిషోర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ స్వప్న, ఎన్‌జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధికి ఉత్తరాది భక్తులు

- నెల రోజుల నుంచి వందలాదిగా టూరిస్టుల రాక
- ఏటా శీతాకాలంలో తరలివస్తున్న వైనం
- వందల కిలోమీటర్లు టూరిస్టు బస్‌లలోనే ప్రయాణం
- సొంత వంట...బస్ వద్దనే బస
- కొండ దిగువ నుంచి కాలినడకనే సత్యదేవుని సన్నిధికి



సత్యదేవుని దర్శనానికి కాలినడకన వెళుతున్న ఉత్తరాది భక్తులు



సామూహికంగా ఫలహారాలు భుజిస్తున్న భక్తులు

అన్నవరం: జై శ్రీరామ్ అంటూ ఇక్కడి భక్తులు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాలరాముడిని దర్శించేందుకు తండోప తండాలుగా వెడుతుంటే ఉత్తరాది రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు రత్నగిరి సత్యదేవుని సన్నిధికి పోటెత్తుతున్నారు. ఏటా ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు సత్యదేవుని దర్శనానికి రావడం సర్వసాధారణమే అయినా ఈసారి ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన నేపథ్యంలో అక్కడి నుంచి భక్తులు ఇక్కడకు రావడం విశేషంగా చెప్పుకోవాలి. సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఝార్ఖండ్, ఛత్తీష్‌గఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో డిసెంబర్‌లో సాగు పూర్తయి, పంటలు చేతికి వస్తాయి. దీంతో తీర్థయాత్రలకు బయల్దేరతారు. ఎక్కువగా మధ్యతరగతి కి చెందిన మధ్యవయసు కలే ఈ యాత్రలు చేస్తుంటారు.



టూరిస్టు బస్‌ల వద్దనే చపాతీలు, పూరీలు తయారు చేస్తున్న దృశ్యం

అన్నవరానికి పోటెత్తుతున్న ఉత్తరాది భక్తులు

కాకినాడ జిల్లాలోని అన్నవరంలో కొలువైన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి కూడా పెద్ద సంఖ్యలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. గత నెలాఖరు నుంచి మొదలైన ఉత్తరాది భక్తుల రాక జనవరిలో మరింత పెరిగింది. గతంలో భక్తులంతా టూరిస్టు బస్‌లలోనే తీర్థయాత్రలు చేసేవారు. అయితే ఇప్పుడు ట్రైన్లు, కార్లలో యాత్రలు చేసేవారు ఎక్కువ. అయితే ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు మాత్రం ఇప్పటికి టూరిస్టు బస్‌లలోనే యాత్రలు చేస్తుండడం విశేషం.

వందల కిలోమీటర్లు దూరం బస్‌లలోనే ప్రయాణించడం ఈ ఉత్తరాది భక్తుల ప్రత్యేకత. సమూహాలుగా టూరిస్ట్ బస్సులో వస్తున్నారు. కనీసం పది బస్సులకు తక్కువ కాకుండా గరిష్ఠంగా 50 బస్‌లలో భక్తులు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. వీరు తమ బస్సులను గతంలో రత్నగిరిపై నిలుపుదల చేసి సత్యదేవుని దర్శనానికి వెళ్లేవారు. అయితే కొండదిగువన కాలేజీ మైదానంలో దేవస్థానం అన్ని వసతులు ఏర్పాటు చేయడంతో వీరు కొండదిగువనే టూరిస్టు బస్సులు నిలిపి సత్యదేవుని దర్శనానికి వెడుతున్నారు.

కాలినడకనే దర్శనానికి...

ఉత్తరాది భక్తుల్లో ఎక్కువమంది కాలినడకనే సత్యదేవుని ఆలయానికి వెళ్లి తిరిగి తమ టూరిస్టు బస్‌ల వద్దకు తిరిగి వస్తారు. వీరిలో పంపా ఘాట్‌లలో స్నానం చేసి ఘాట్‌రోడ్ ద్వారా నడుస్తూ ఆలయానికి వెళ్లేవారే ఎక్కువ.

సొంత వంట...

వీరు వంట సామగ్రి, పొయ్యలు, గ్యాస్ సిలిండర్లు కూడా తెచ్చుకుంటారు. వీరు బస్‌లు ఆగినచోటే వంటలు చేసుకుని సామూహికంగా భుజిస్తుంటారు. బయట ఎక్కడా కొనుక్కుని తినరు. ఫలహారమైనా, చపాతీలైనా, పూరీలైనా వండుకోవల్సిందే. ప్రతీ బస్‌లో ఒక వంట మేస్త్రి, ఇద్దరు సహాయకులు ఉంటారు. వీరికి మరికొంతమంది భక్తులు సహాయం చేస్తారు. ఎక్కువగా వీరు భుజించేది చపాతీలు, పూరీలు. వాటిలో టమాట, బంగాళాదుంప కూర ఉంటుంది. తమతో బాటే గోధుమ పిండి, నూనె, బంగాళాదుంపలు, టమటాలు ఇతర కూరగాయలు తెచ్చుకుంటారు. ఇవి అయిపోతే మరలా స్థానికంగా కొనుక్కుంటారు. వండుకున్న పదార్థాలను అందరూ వరుసగా కూర్చుని తింటారు. దగ్గరలో సత్రాలు ఉంటే వాటిలో హాల్స్ అద్దెకు తీసుకుని బస చేస్తారు. ఒకవేళ అటువంటి సత్రాలు లేకపోతే బస్‌లలో విశ్రమించడం వీరికి అలవాటు. ఈ నెలాఖరు వరకు ఈ ఉత్తరాది భక్తుల రాక కొనసాగనుంది. ఇటువంటి భక్తుల కోసం దేవస్థానం కళాశాల మైదానంలో విశ్రాంతి షెడ్లు నిర్మించింది. కాని అవి ఇంకా వినియోగంలోకి రాకపోవడంతో వీరు తమ టూరిస్టు బస్‌ల వద్దనే విశ్రమిస్తున్నారు.

జీవితాల్లో వెలుగులు



డ్వాక్రా మహిళలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశ పెట్టి నాలుగు విడతలుగా రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్ మా జీవితాల్లో వెలుగులు నింపారు. ఈ రుణమాఫీ సొమ్ముతో ఆర్థిక అవసరాలు తీర్చుకుని స్వయం సమృద్ధిని సాధిస్తున్నాం. మహిళల సంక్షేమానికి జగన్ అనేక రకాల సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. వైఎస్సార్ ఆసరాతో రూ.63,500 లబ్ధి పొందాను.



– గుత్తుల విజయ రామతులసి, విజయజ్యోతి ఎంఎస్ఎస్, పెదపల్ల, ఆలమూరు

నూతన విద్యావిధానం అమల్లో మనమే ప్రథమం

- దేశంలోనే ముందంజలో రాష్ట్రం
- వర్క్‌షాపులో నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: నూతన విద్యా విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. యూనివర్సిటీలో బుధవారం 'సోషల్ ఇంజినీరింగ్ యాక్సెస్ అండ్ ఇన్క్లూజన్', 'యువసాధికారత – ఉపాధి' అనే అంశాలపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కరిక్యులమ్‌లో 30 శాతం స్కిల్ ప్రోగ్రామ్స్ ఉండటంతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందన్నారు. ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు చదువుకునే సమయంలోనే ఇంటర్న్‌షిప్ చేసే అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై త్వరలో యూనివర్సిటీలో శిక్షణ ఇస్తామన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 'యువ సాధికారత – ఉపాధి' అనే అంశంపై బెంగళూరుకు చెందిన జేవీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రొఫెసర్ ఎస్ఎంకే భట్ట ఉపన్యసించారు. రాష్ట్రంలో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి కార్యక్రమాలతో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. 'సోషల్ ఇంజినీరింగ్ యాక్సెస్ అండ్ ఇన్క్లూజన్' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ లోకానందరెడ్డి ఐరాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లలో సాధించిన ప్రగతిని వివరించారు. ఆచార్య కేఎస్ రమేష్ కన్వీనర్‌గా, డాక్టర్ పి.ఉమామహేశ్వరిదేవి కో కన్వీనర్‌గా వ్యవహరించిన వర్క్‌షాప్‌లో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

క్రీడలతో శారీరక, మానసిక ఎదుగుదల

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కన్నబాబు
- ముగిసిన జాతీయ లాన్ టెన్నిస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): శారీరక మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహద పడతాయని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ డీఎస్ఏలో విద్యాశాఖ ఆధ్వర్యంలో 67వ జాతీయ అండర్–19 పురుషుల లాన్‌టెన్నిస్ పోటీలు బుధవారం అట్టహాసంగా ముగిశాయి. ముగింపోత్సవానికి రాష్ట్ర పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి భానుమూర్తి రాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ క్రీడలకు పెద్దపీట వేస్తూ విద్యార్థుల పురోగతికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జాతీయస్థాయిలో చక్కగా రాణించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన అధికారులను ప్రశంసించారు. ఆడుదాం ఆంధ్రా ద్వారా యువతలోని ప్రతిభను వెలికి తీయడానికి కృషిచేస్తున్నామన్నారు. గౌరవ అతిథి, శాసన మండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంచాలకులు జి.నాగమణి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లకు ఎక్కడా లోటు లేకుండా చక్కగా కార్యక్రమాన్ని నిర్వహించిన వివిధ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. పాఠశాల క్రీడాసమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్, చీఫ్ రిఫరీ శ్రీకుమార్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు.



టీం ఈవెంట్‌లో విజేత హర్యానా జట్టుతో ఎమ్మెల్యే కన్నబాబు, చిత్రంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

టీం ఈవెంట్ విజేతగా హర్యానా

ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించిన ఈ పోటీలలో 23 రాష్ట్రాల నుంచి 119 మంది క్రీడాకారులు హాజరు కాగా 154 మ్యాచ్‌లు నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో అర్జున్ రాఠీ (హర్యానా), వి.ధీరజ్ (తెలంగాణ), వహీన్ పటేల్ (గుజరాత్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు అందుకున్నారు. టీం ఈవెంట్‌లో హర్యానా ప్రథమ, గుజరాత్ ద్వితీయ, మహారాష్ట్ర తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు ఎమ్మెల్యే కన్నబాబు, ఎమెల్సీ కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు సుబ్బారావు, రామకృష్ణ, జేఎన్టీయూకే పాలక మండలి సభ్యులు బెజవాడ సత్యనారాయణ, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, డీవైఈఓలు ఆర్‌జే డానియేల్ రాజు, సుభద్ర, ఎంఈఓలు పుల్లయ్య, రవి, ఏసుదాసు, శివ, ప్రసాద్, ఆర్‌వీ ప్రసాద్, పాఠశాల క్రీడాసమాఖ్య సంయుక్త కార్యదర్శి శ్రీహరి, కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తుని: స్థానిక రైల్వేస్టేషన్ కొండవారిపేట అండర్ పాసు వద్ద సుమారు 45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. బుధవారం స్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న రైలు కింద తలపెట్టి ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కుడి చేతిపై రాజు అనే పచ్చ బొట్టు ఉందని, పసుపు గళ్ల చొక్కా, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించాడన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 94948 87786, 94906 19020 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వైభవంగా ఎమ్మెల్యే చిట్టిబాబు తనయుడి వివాహం

పి.గన్నవరం: స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తనయుడు వికాష్‌బాబు, అభిజ్ఞల వివాహ మహోత్సవం వాడ్రేవుపల్లిలో బుధవారం వైభవంగా జరిగింది. గటిగంటి వాసు ఫంక్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు పండుల రవీంద్రబాబు, బొమ్మి ఇజ్రాయిల్, ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యేలు చిర్ల జగ్గిరెడ్డి, పొన్నాడ సతీష్ కుమార్, జక్కంపూడి రాజా, రాపాక వరప్రసాదరావు, ఎలీజా, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, ఆర్డీఓ ఎం.ముక్కంటి, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్ పర్సన్ కుడుపూడి సత్యశైలజ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమానికి వచ్చేసిన అతిథులకు ఎమ్మెల్యే చిట్టిబాబు, లక్ష్మి దంపతులు స్వాగతం పలికారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి వేణు, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

30న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి జీఎంసీ బాలయోగి సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరగనుంది. ఈ విషయాన్ని జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి బుధవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ శాఖల ద్వారా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ప్రగతిని ప్రధాన అజెండాగా సమీక్షిస్తామన్నారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

రైలు నుంచి జారిపడి జార్ఖండ్ వాసి మృతి

తుని: గొల్లప్రోలు–రావికంపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సరోటదేవి (40) మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్సై ఎస్.కె.అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సరోటదేవి హాటియా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ రావికంపాడు స్టేషన్ సమీపంలో ప్రమాదశాత్తూ రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు కుటుంబ సభ్యులు తుని జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



మృతి చెందిన సరోట దేవి

పాపం పసివాళ్లు...

- ఉమ్మెత్తకాయలు తిని 8 మంది చిన్నారులకు అస్వస్థత
- ఇద్దరి పరిస్థితి విషమం
- నల్లజర్ల మండలం పోతవరంలో ఘటన

నల్లజర్ల: అభం శుభం తెలియని ఆ చిన్నారులు ఆడుకుంటూ తమ నివాసం సమీపంలోని ఉమ్మెత్త చెట్టు కాయలు తిని అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పిల్లుట్ల, నాగవరం తదితర గ్రామాల నుంచి 11 కుటుంబాలు పోతవరం లోని వర్జీనియా పొగాకు క్యూరింగ్ పనులకు వచ్చాయి. రైతులు అబ్బూరి దొరబాబు, కానూరి అమ్మిరాజు పొలంలో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని, పొగాకు కొట్టు పనులు చేస్తున్నాయి. యథావిధిగా బుధవారం పొగాకు పనులకు వెళ్లగా మకాంలోని 8 మంది పిల్లలు మధ్యాహ్న సమయంలో ఆడుకుంటూ ఎదురుగా ఉన్న పాత్రుని చెరువు గట్టున ఉన్న ఉమ్మెత్తి చెట్టు కాయలను తిన్నారు. పెద్దలు పని ముగించుకుని సాయంత్రం 4 గంటలకు మకాం వద్దకు వచ్చేసరికి పిల్లలందరూ వాంతులు చేసుకోవడాన్ని గమనించారు. వెంటనే స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరుకు తరలించారు. పిల్లలందరూ మూడు, నాలుగేళ్ల చిన్నారులే.



జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులు

బీచ్‌లో మెడికో మృతదేహం

కాకినాడ రూరల్: వైద్యురాలిగా బంగారు భవిష్యత్తు ఉన్న ఆ యువతి అర్థాంతరంగా తనువు చాలించింది. చదువుల్లో ముందంజలో ఉండే ఆ బంగారు తల్లికి ఏమి కష్టం వచ్చిందో నేమాం బీచ్‌లో ఇసుక తిన్నెల్లో విగత జీవిగా కనిపించింది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన ప్రకారం.. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఈయర్ వైద్య విద్యను అభ్యసిస్తున్న మెడికో వంకదారి శ్వేత (25) మృతదేహం నేమాం బీచ్‌లో బుధవారం సాయంత్రం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న తిమ్మాపురం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, కాకినాడ ప్రభుత్వాస్పత్రికి పీఎం నిమిత్తం తరలించారు. కాకినాడ రంగయ్యనాయుడు వీధి సాయిబాబా గుడి సమీపంలో శ్వేత కుటుంబం నివసిస్తోంది. శ్వేత నీట్‌లో జనరల్ కేటగిరిలో 714 ర్యాంక్ సాధించి రంగరాయ మెడికల్ కళాశాలలో 2018 –19లో ఎంబీబీఎస్‌లో చేరింది. గురువారంతో పరీక్షలు ముగియనున్నాయి. ప్రాక్టికల్ ఎగ్జామ్ కోసం తండ్రి కుబేరరావు బుధవారం ఉదయం 8.45 గంటలకు ఆమెను కాకినాడ ప్రభుత్వాస్పత్రి వద్ద దింపాడు. తండ్రి వెళ్లిన పది నిమిషాలు తరువాత పరీక్ష హాలులోకి వెళ్లకుండా శ్వేత బయటకు వెళ్లిపోయింది. బీచ్‌లో మృతదేహం లభ్యమవ్వడంతో తల్లి ఆశాజ్యోతి, తండ్రి కుబేరరావు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. శ్వేత సోదరుడు హైదరాబాద్‌లో పీహెచ్‌డీ చేస్తున్నాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు తిమ్మాపురం ఎస్సై షేక్ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వంకదారి శ్వేత (ఫైల్)

